క్లుప్తంగా

దుర్గాపురంలో వృద్ధులకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బి.వసంతకుమార్ అన్నారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం దుర్గాపురానికి చెందిన బ్రహ్మదేశం పద్మావతి శ్రీనివాసన్ జ్ఞాపకార్థం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా అన్నదానం చేయటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం నిరుపేదలకు, మాతృదేవోభవ సంస్థలోని వృద్ధులకు భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, జి.ఏడుకొండలు, మాతృదేవోభవ సంస్థ సభ్యులు దుర్గ, జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

వాసవీ మాత జయంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమం బీసెంట్ రోడ్డులోని వసంత గ్రాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర పూజలు, లక్ష పుష్పార్చన చేశారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 23 డివిజన్ వైఎస్సార్ సీపీఇంచార్జి ఆత్మకూరి సుబ్బారావు, ఐత లక్ష్మణరావు, నదర్స్ శ్రీను, గార్లపాటి మల్లికార్జునరావు, కొల్లిపర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వారికి రూ.లక్ష విరాళం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం సత్యనారాయణపురం వర్తక సంఘం అధ్యక్షుడు మైలవరపు రాము, పద్మావతి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణకు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలకు స్వామివార్ల దర్శనం చేయించి వేదపండితులచే ఆశీర్వచనాలు అందజేశారు.

దేవీనగర్‌లో మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో ఆదివారం దేవీనగర్ కాపు సేవాసంఘం ఆధ్వర్యాన అర్జా నాంచారయ్య సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. దాత అర్జా నాంచారయ్య మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సామంతపూడి సుబ్బరాజు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లికి చెందిన రాధా నృత్యనిలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరత నాట్య నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం నృత్య ప్రదర్శన జరిగింది. నృత్య నిలయానికి చెందిన 20 మంది కళాకారులు పలు కీర్తనలకు భరత నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నదిలో దూకిన వ్యక్తిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడి ఆదివారం ఒడ్డుకు చేర్చారు. నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతానికి చెందిన పులుపు వెంకటేష్(34) వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ మీదకు చేరుకొని కృష్ణా నదిలోకి దూకాడు.. పాదచారుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది నదిలోకి దూకి వెంకటేష్‌ను కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం వెంకటేష్‌ను వన్‌టౌన్ పోలీసులకు తరలించి, అతని కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ ఢిల్లీరావు
- యోగా ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ఉచిత శిక్షణా తరగతులను ఆదివారం ఉదయం ఢిల్లీరావు ప్రారంభించారు. యోగ సాధకులతో కలిసి ఢిల్లీరావు కొద్దిసేపు యోగాసనాలు, ప్రాణాయామం ప్రాక్టీస్ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉండవచ్చునన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మానసిక ఒత్తిడి అనేది అనివార్యంగా మారిందని, దాని వల్ల వ్యాధులు కూడా చాలా తేలికగా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగ సాధన ఒక్కటే మార్గమన్నారు. పూర్వీకులు యోగ సాధన చేసి ఎటువంటి వ్యాధులు లేకుండా సంపూర్ణ ఆయుష్‌తో జీవించారన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటుగా క్రమశిక్షణ, సమయపాలన, మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. జిల్లాలోని 257 ఆరోగ్య కేంద్రాల్లో కూడా వివిధ రకాల వైద్య విధానాలతో పాటుగా యోగాను కూడా ఒక అంశంగా చేర్చామని ఢిల్లీరావు చెప్పారు. ప్రపంచంలోని పాశ్చాత్య దేశాలల్లో సైతం యోగాను సర్వరోగ నివారిణిగా భావిస్తున్నారని చెప్పారు.

అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కువ మందికి యోగాను పరిచయం చేసేందుకు ప్రతి ఏడాది వేసవిలో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగ సాధన వల్ల దీర్ఘకాలిక వ్యాధులను సైతం మందులు ఉపయోగించకుండా అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. నెల రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఈ యోగా శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా లీగ్ చీఫ్ కో–ఆర్డినేటర్ జీ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగ ప్రాధాన్యతను ప్రపంచం మొత్తం గుర్తించడం మన దేశానికి గర్వకారణమన్నారు. అసోసియేషన్ సభ్యులు చుక్కపల్లి అరుణ్‌కుమార్, మిరియాల వెంకటేశ్వరరావు, యల్లారావుతో పాటుగా వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, యోగా సాధకులు పాల్గొన్నారు. సభ అనంతరం యోగా గురువు అంకాల సత్యనారాయణను ఢిల్లీరావు సత్కరించారు.



యోగా గురువు అంకాల సత్యనారాయణను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



యోగా చేస్తున్న ఢిల్లీరావు

ఠాగూర్ గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానసిక ప్రశాంతతకు ధ్యానం అవసరమని, ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జమల పూర్ణమ్మ మాట్లాడుతూ ప్రతి రోజూ 10 నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ధ్యాన సాధన చేసి మనసుపై పట్టు సాధించాలన్నారు. ధ్యాన శిక్షణ అధ్యాపకురాలు నామన సత్య రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ధ్యానం వలన వ్యర్థమైన ఆలోచనలు, వ్యసనాలు పోతాయన్నారు. చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల చేత ధ్యానం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, గ్రేడ్–3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి, సిబ్బంది కె.రాంబాబు, గోపాలరావు, దుర్గాంబ పాల్గొన్నారు.

సౌమ్యకు ది డ్యాన్స్ ఇండియా యంగ్ టీచర్ అవార్డ్

విజయవాడకల్చరల్: తనకు ది డ్యాన్స్ ఇండియా యంగ్ టీచర్ అవార్డ్ లభించిందని నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి భాగవతుల సౌమ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ది డ్యాన్స్ ఇండియా మాస పత్రిక ప్రతీ ఏటా సంప్రదాయ నృత్యంలో విశేషమైన కృషి చేసిన వారికి యంగ్ టీచర్ పురస్కారంతో సత్కరిస్తుందన్నారు. 2023 సంవత్సరానికి గానూ అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డ్‌ను ప్రదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాట్యశాఖ ప్రొఫెసర్ వనజా ఉదయ్, ది డ్యాన్స్ ఇండియా మాసపత్రిక సంపాదకుడు బత్తిన విక్రమ్‌కుమార్, సహ సంపాదకురాలు కిర్మణయి బోనాల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. భాగవతుల సౌమ్య సంప్రదాయ కూచిపూడి నృత్య కుటుంబానికి చెందిన వారు. ఘంటసాల సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమెను సంగీత కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఇతర నాట్యాచార్యులు అభినందించారు.



భాగవతుల సౌమ్యకు అవార్డ్ ప్రదానం చేస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్, వజనా ఉదయ్, కిరణ్మయి బోనాల

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అజిత్‌సింగ్‌నగర్ సీఐ జి.గురుప్రకాష్ సూచించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఆటో డ్రైవర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లు మాట్లాడడంతో ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఇష్టారాజ్యంగా రోడ్డు మధ్యలో ఆటోలు ఆపేయడం వల్ల ఇతర ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆటో డ్రైవర్లు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. రైల్వేస్టేషన్ వద్ద ఆటో స్టాండ్‌లోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే టప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ గురుప్రకాష్

బాబా ఆశీస్సులతో లక్ష్యాలు చేరుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీషిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.వైష్ణవితో సహా అత్యుత్తమ మార్కులు సాధించిన మరో నలుగురు విద్యార్థులను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో వైష్ణవి 466 మార్కులు సాధించి నగరానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. అలాగే జి.భువనేశ్వరి 458, భారతి 453, పి.లాస్య 455 మార్కులు సాధించగా బైపీసీ విద్యార్థి ఎన్‌డీఎస్ సుదీప్తి 436 మార్కులు సాధించటం అభినందనీయం అన్నారు. బాబా మందిరం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు విద్యాభివృద్ధికి పలు సేవలు అందిస్తున్నామన్నారు. నిరుపేద విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లిస్తున్నామని తెలిపారు. అనంతరం బాబావారి ఆలయం అర్చకులు దివంగత శ్రీనివాసరావు ద్వితీయ కుమారుడు కళాశాల ఫీజుకు రూ.38వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సభ్యులు యాదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరించి, కాలేజీ ఫీజు అందజేస్తున్న గౌతమ్‌రెడ్డి

నేడు కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్ సమీపంలోని తమ సంస్థ ఆవరణలో సోమవారం ఉదయం 11.30 గంటలకు కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, ఎంబీవీకే భవన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.క్రాంతికుమార్, జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్న అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల వారు సదస్సుకు హాజరు కావాలన్నారు.

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం జరిగే స్పందనలో నగరవాసులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

6 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6 నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూ.వి.రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ కంపెనీల్లో సెమినార్‌లు నిర్వహించిన అనుభవం కలిగిన పాగోలు రాజు తరగతులు బోధిస్తారని చెప్పారు. ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా ఆధునిక పద్ధతుల్లో సులభతరంగా బోధించడం, ప్రతి రోజు ఇంగ్లిషులో మాట్లాడటంపై సాధన చేయిస్తారన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి కల వారు ఈ నెల 5వ తేదీ లోగా తమ కార్యాలయంలో గానీ, 0866 2578044, 63059 54249 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

• జోరువానతో బెంబేలు





జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని భారీగా వర్షం కురుస్తుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ నిరంతరం కృషి చేస్తోందని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా షేక్ ఆదం షరీఫ్, మైలవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా సమీనా ఫాతిమా, మైలవరం నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షుడిగా షేక్ జాన్‌భాషాలను నియమిస్తూ ఆదివారం వారికి నియామకపత్రాలు, ఐడీ కార్డులను అందజేశారు. నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. నిరుపేద ముస్లింలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలను తమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్ అలీ, సయ్యద్ మౌలాలి, షేక్ హుస్సేన్, మస్తాన్, కలందర్, గౌస్‌బాషా పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న నాగుల్‌మీరా, కమిటీ సభ్యులు

300 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మాచవరం వాకర్స్‌క్లబ్ నాయకులు సుబ్బారావు, డాక్టర్ చల్లా హరికుమార్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఆర్యన్ రీనల్ కేర్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. ప్రముఖ వైద్యులు పవన్ సాయి పోతుల, సింధు చాగంటి, మధు కిరణ్ ఓగిరాల, మస్తాన్ ఎస్‌కే, లోహిత్ సీతారామ్ 300 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. నాయకులు శ్రీనివాసరావు, ఎస్వీఆర్, అంజూరి శేషుబాబు పాల్గొన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఏవీకే ప్రసాద్, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా వీర బ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌న ర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు మాట్లాడుతూ వయోవృద్ధులకు తాము ప్రతీ ఆదివారం ఉచితంగా ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యులచే ఉచిత వైద్యపరీక్షలు చేయించటంతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘమైన సింగ్‌నగర్ సెయింట్ పీటర్స్ లూథరన్ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సంఘకాపరి రెవ.జి.ప్రశాంతరాజు ప్రారంభ ప్రార్థన చేయగా గుంటూరుకు చెందిన రెవ. కర్రా విక్టోరియా దైవ సందేశాన్ని అందించారు. ముందుగా స్త్రీల సమాజం సభ్యులు, సంఘపెద్దలు ప్రదర్శించిన పలు నాటికలు, ఆలపించిన ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఎం.సత్యవేదం, మరియమ్మ, జి.పద్మ, ఎం.ప్రమీలమ్మ, కోలా శాంతకుమారి, రత్నడేవిడ్ ఉన్నారు.

యుగంధరాచార్యకు పౌర సన్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జ్యోతిష్యంలో గిన్నీస్ రికార్డు సాధించిన గానుగుల యుగంధరాచార్య నగరానికి చెందిన వారు కావడం గర్వకారణమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వన్‌టౌన్ షిర్డీసాయిబాబా మందిరం చైర్మన్ పట్నాల హరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్ నందు లక్ష మందికి జ్యోతిష్యం చెప్పి గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించిన పండిత డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు పౌర సన్మానం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు. యుగంధరాచార్యకు వరహామిహిర పురస్కారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ యుగంధరాచార్య జ్యోతిష్యంలో గిన్నీస్ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వయసులో చిన్నవాడైన యుగంధరాచార్య లక్ష మందికి జాతకం చెప్పడం మిరాకిల్ అన్నారు. తాను సంపాదించిన జ్ఞానాన్ని పది మందికి పంచాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు సాధించిన యుగంధరాచార్యను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్కృతాంధ్ర పండితులు పరాశరం వేంకట రమణాచార్యులు, డాక్టర్ జె.వి.చలపతిరావు, చిప్పాడ చందు పాల్గొన్నారు.



యుగంధరాచార్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

ఆర్యవైశ్య మహాసభ కార్యాలయం ప్రారంభం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం, శివాజీకేఫ్ సెంటర్‌లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సెంట్రల్ నియోజకవర్గ నూతన కార్యాలయం ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ చేతులమీదుగా ప్రారంభించారు. ముందుగా వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబికా కృష్ణ మాట్లాడుతూ.. వాసవీ అమ్మవారి జయంతి రోజున ఆర్యవైశ్య భవనం ప్రారంభించడం శుభపరిణామమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్యవైశ్యులకు అండగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒగ్గవరపు వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కార్యాలయం ఏర్పాటు చేయడం భగవంతుని కార్యంగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో ఆర్యవైశ్య కార్యాలయం ప్రారంభిస్తున్న అంబికా కృష్ణ

ఎస్ఆర్ఆర్‌లో శ్రీశ్రీ జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన కవిత్వంతో తెలుగు జాతిని మేల్కొలిపిన మహాకవి శ్రీశ్రీ అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన శ్రీశ్రీ జయంతి కార్యకమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మన్మథ, నాయకులు రాజ్‌కుమార్, శైని, కృష్ణ పాల్గొన్నారు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతలు